# పసుపూ - కుంకుమా

తల అంతా దిమ్ముగా ఏదో పోట్లు పొడుస్తున్నట్టుగా వుంది సారధికి.

బలవంతంగా కళ్లు తెరవటానికి ప్రయత్నం చేశాడు.

"సారధికి స్పృహ వచ్చింది - కళ్లు తెరుస్తున్నాడు" అంటున్నారు ఎవరో.

సారధికి అసలు ఏం జరిగిందో కూడా గుర్తు లేదు.

తన అన్న భానుమూర్తి, తనూ గోదావరిలో స్నానం చేసివద్దామని బయల్దేరారు. మద్రాస్‌లో ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్న సారధి - రాజమండ్రికి వచ్చినప్పుడల్లా అన్నతో కలసి గోదావరిలో ఈత కొట్టటం ఒక కార్యక్రమంగా పెట్టుకున్నాడు. ఈసారి పెళ్లి చూపులకని వచ్చిన సారధి అలవాటు ప్రకారం అన్నతో కలసి గోదావరిలో ఈత కొట్టటానికి బయల్దేరాడు.

"మన జీవితం కూడా ఇలాంటిదే సారధీ! ఒక్కో సీజన్‌లో యిలా ఉధృతంగా ప్రవహిస్తుంది. ఒక్కో సీజన్‌లో చాలా నిశ్చలనంగా, కామ్‌గా ఉంటుంది. జీవిత ప్రవాహం ఎలా వున్నా నేర్పుగా ఈదగలవాడే జీవితాన్ని సుఖమయం చేసుకోగలడు!" అన్నాడు భానుమూర్తి నీళ్ళల్లోకి దిగుతూ.

దాదాపు గంటసేపు అలా గోదావరిలో ఈత కొట్టారు భానుమూర్తీ, సారధీ.

సారధి ఇంకా ముందుకు వెళ్ళటం చూసి వారించాడు భానుమూర్తి.

"సారధీ! యింకా ముందుకు వెళ్లకు. అక్కడ సుడిగుండాలు వున్నాయి."

భానుమూర్తి మాటలు పూర్తయేలోగానే, సారధి అక్కడకు వెళ్లటమేకాక బాలన్స్ కూడా తప్పిపోయి గిరగిరా తిరగసాగాడు. చేతులు పైకెత్తి "హెల్ప్, హెల్ప్" అని అరిచాడు.

"సారధీ!" పెద్దగా అరిచాడు భానుమూర్తి, తనూ ముందుకు ఈదుతూ.

సారధి నీళ్ల లోపలకు పూర్తిగా మునిగిపోయి మళ్లీ పైకి తేలాడు.

ప్రక్కనేవున్న ఒకరిద్దరు చాకలి వాళ్లు కూడా యిది చూసి గబగబా నీళ్లలో దూకి ముందుకు ఈదుకువచ్చారు.

"సారధీ! నే వస్తున్నా జాగ్రత్త! మళ్లీ మునగకుండా ప్రయత్నం చేయి !" అరుస్తూ ముందుకు వచ్చాడు భానుమూర్తి . చేయి అందిస్తున్నాడు.

నీళ్లలో మళ్లీ మునిగిపోయాడు సారధి. తర్వాత ఏం జరిగిందో కూడా అతనికి తెలీదు.

కళ్లు తెరిచేసరికి యింట్లో వున్నాడు.

"సారధీ! ఎలా వుంది?" అడుగుతున్నాడు తండ్రి సోమయాజులు.

"నాయనా - యిటు చూడు బాబూ!" అంటున్నది తల్లి రాజ్యలక్ష్మి.

"ఏం భయం లేదు!" అంటున్నాడు డాక్టరు తన బ్యాగ్ సర్దుకుంటూ.

నీరసంగా అటూ, యిటూ చూశాడు సారధి. చుట్టూ తెలిసినవాళ్లు చాలా మంది వున్నారు. కాని అతను వెదకబోయిన భానుమూర్తి మాత్రం కనపడలేదు.

"భాను...భాను ఏడీ ..." అడిగాడు సారధి.

"ఇంకెక్కడి భానురా నాయనా..." తల్లి సారధి మీద పడి ఒక్కసారిగా బావురుమంది.

తండ్రి ప్రక్కకు తిరిగి పైపంచతో కళ్లు తుడుచుకుంటున్నాడు.

"అమ్మా ... భాను ..." సారధికి నోట మాట రాలేదు.

"టేకిట్ యీజీ సారధీ! భానుమూర్తి యింక లేడు. గోదావరిలో మునిగి చనిపోయాడు. నువ్వు మాత్రం అదృష్టవశాత్తూ..." డాక్టర్ యింక ఏమీ అనకుండా, భారంగా అడుగులు వేస్తూ వెళ్లిపోయాడు.

సారధికి కళ్లు తిరిగినట్టయింది. ఒక్కసారిగా షాక్ తిన్నాడు. దిండులో తల దూర్చి - వెక్కి వెక్కి ఏడ్చాడు.

తను అసలు ఆ సుడిగుండంలో కొట్టుకుపోవలసినవాడు. భానుమూర్తి తనను రక్షించటానికి ముందుకు రావటం, చేయి అందించటం గుర్తుకు వచ్చింది. అతని వెనకనే వచ్చిన చాకలి వాళ్లు సారధిని బయటకు లాగడం, భానుమూర్తి మాత్రం ఆ సుడిగుండంలో ఎవరికీ అందకుండా మునిగిపోవటం మాత్రం అప్పటికే స్పృహ కోల్పోయిన సారధికి తెలీలేదు. అతని ప్రాణాలు కూడా లెక్కచేయక తనకు ప్రాణం పోశాడన్నమాట భానుమూర్తి.

"భానూ!" పెద్దగా విలపించాడు సారధి, చేతుల్లో ముఖం దాచుకుని.

ఎవరో సారధి భుజం మీద చేయి వేసి ఓదార్చుతున్నారు.

"ఊరుకో బాబూ! నువ్వే యిలా బాధపడితే ఎలా? చూడు మీ అమ్మా, నాన్న ఎలా డీలా పడిపోయారో! మీ వదిన అసలే నెలలు నిండిన మనిషి - ఆవిడ బాధ అర్థం చేసుకోవేం? లే - లేచి వాళ్లకు ధైర్యం చెప్పు."

సారధికి అప్పుడు అనిపించింది - తనే యింత బాధపడుతుంటే నిండు గర్భిణిగావున్న తన వదిన యింకెంత బాధపడుతుంది?

మంచం మీద లేచి కూర్చున్నాడు. గుండె నిబ్బరం చేసుకున్నాడు.

ఇంతలో పెరటిలో పెద్దగా గోల, అరుపులు వినపడ్డాయి. "ఎంత పనికి ఒడికట్టావే! ఒక్క క్షణం ఆలస్యం అయితే అనవసరంగా రెండు ప్రాణాలు పోయివుండేవి..." అంటున్నారెవరో.

"శ్యామలా! ఏం పనమ్మా యిది? నువ్వు ప్రాణం తీసుకుంటే చచ్చిపోయినవాళ్లు తిరిగి వస్తారా?" అంటున్నాడు సోమయాజులు.

సారధి చటుక్కున లేచి రెండు అడుగుల్లో పెరట్లోకి వచ్చాడు.

అక్కడి సన్నివేశం చూసి దిగ్భ్రమచెందాడు. తన తల్లీ, యింకో యిద్దరు అమ్మలక్కలూ కలసి నూతి దగ్గర నుంచి శ్యామలను బలవంతంగా తెస్తున్నారు. శ్యామల వాళ్ల చేతుల్లో గింజుకుంటున్నది. ఆమె కళ్ల నుంచి నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి.

"అసలే నెలలు నిండిన మనిషివి. తప్పు కాదమ్మాయ్! కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడాలికానీ - " ఏదేదో చెబుతూ లోపలకు తెస్తున్నారు శ్యామలను.

సారధి ఆ సన్నివేశం చూసిన తర్వాత అక్కడ నుంచోలేకపోయాడు. డాబా మీదకు చకచకా వెళ్లి, అక్కడ చతికిలబడ్డాడు. మోకాళ్ల మీద తల వుంచి కదలకుండా కూర్చున్నాడు.

మధ్యాహ్నపు ఎండ అతన్ని మాడ్చేస్తున్నది. అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలీదు.

క్రింద ఒక్కసారిగా గోల వినపడితే, గబగబా దిగి క్రిందకు వచ్చిడు.

"భానుమూర్తి శవం దొరికింది - రెండు మైళ్ల అవతల తేలింది!"

పరుగెత్తినంత వేగంగా వాకిట్లోకి వచ్చాడు. ఎద్దు బండిలో గడ్డి మీద దుప్పటి కప్పబడివుంది భానుమూర్తి శవం.

నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెళ్లాడు సారధి.

తల దగ్గర దుప్పటి తొలగించాడు. నీళ్లలో నానివుండేమో, బాగా తెల్లగా, ఉబ్బి వుంది బానుమూర్తి శరీరం. నెమ్మదిగా భానుమూర్తి తల మీద వెంట్రుకలను చేత్తో సవరించాడు సారధి. ఒక్కసారిగా మళ్లీ దుఃఖం కట్టలు తెంచుకుంది. దుప్పటి ముసుగు వేసి ఒక క్షణం బండికే ఆనుకుని నిలబడ్డాడు.

శవాన్ని యింటి ముందు పడుకోపెట్టారు.

తమకు కావలసిన వాళ్లందరూ ఏడుస్తూనే వున్నారక్కడ.

తల్లి భానుమూర్తి శరీరం మీద పడి శోకాలు పెడుతున్నది - "అప్పుడే నీకు నూరేళ్లూ నిండాయా!" అంటూ.

తండ్రి పైకి ఏడవకపోయినా, పక్కకు తిరిగి కన్నీళ్లు తుడుచుకుంటూనే ఉన్నాడు.

మేనత్త తన తల్లిని ఓదారుస్తూ మధ్య, మధ్యలో తనూ ముక్కు చీదిపారేస్తున్నది.

కానీ శ్యామల మాత్రం కనపడలేదు.

సారధి శ్యామల కోసం చుట్టూ చూశాడు. కానీ కనపడలేదు.

"వదినా... వదినా..." అని పిలిచాడు అటూ యిటూ చూస్తూ.

"వదినకు నొప్పులు వస్తుంటే సరస్వతమ్మ గారు ప్రక్కనే వున్న హాస్పిటల్‌కు తీసుకెళ్లి జాయిన్ చేసింది. అదీకాక యిప్పుడు యీ శవాన్ని యిలా చూపిందంటే శ్యామల ఆరోగ్యానికే ప్రమాదం. నిండు చూలాలు - తట్టుకోలేదు!" అన్నది మేనత్త.

సారధి హృదయం మొద్దుబారిపోయింది. ఒక్కసారిగా అన్నీ ఒక దాని మీదొకటి ముంచుకొస్తున్నాయేమిటా అనుకున్నాడు. ఇంకాసేపటిలో భానుమూర్తి శవానికి

అంత్యక్రియలు జరుగుతాయి. అంటే భానుమూర్తి భౌతికంగా కూడా యిక యీ లోకంలో వుండడన్నమాట. మరి వదినకు భానుమూర్తి శవాన్నయినా అఖరుసారిగా చూసే అవకాశం లేదే... ఎలా.... పోనీ తను వెళ్ళి ఆవిడ్ని ఒక్క క్షణం తీసుకువస్తే - తనకు తెలుసు వదినకు భానుమూర్తి అంటే ఎంత ప్రేమో - ఎక్కడ నుంచయినా ఒక్క క్షణం రావటం ఆలస్యం అయితే వేయి కళ్ళతో ఆత్రుతగా ఎదురుచూసేది - అలాటిది, యిప్పుడు ఎలా ...ఎలా... భరించగలదు? ఒక విధంగా యిప్పుడావిడ యిక్కడకు రాకపోవటమే మంచిదేమో. కనీసం ఆవిడ ప్రాణమన్నా దక్కుతుంది.

భానుమూర్తి అంత్యక్రియలన్నీ సోమయాజులే దగ్గరుండి జరిపించాడు.

అక్కడ హాస్పటల్లో శ్యామల పండంటి ఆడపిల్లను కన్నది.

శ్యామలకు వున్నది ఒక మేనమామ రాఘవయ్యా, ఆయన భార్య జానకమ్మ - అంతకు మించి ఆదుకునేవాళ్ళెవరూ లేకపోవటంవల్ల వాళ్ళే వచ్చి, ఆమెకు ధైర్యం చెబుతూ ప్రక్కన వున్నారు.

"సారధీ! ఆయన ఆడపిల్ల కావాలని ఎంత కలవరించేవారో తెలుసా! ఆయన యిష్ట ప్రకారం ఆడపిల్లనే కన్నాను సారధీ! కానీ దాన్ని చూడటానికి ఆయన ఏరీ!" విలవిల్లాడింది శ్యామల.

వస్తున్న దుఃఖాన్ని గుండెల్లోనే బిగపట్టి అన్నాడు సారధి - " బాధపడకు వదినా! పాపను పెద్దదాన్ని చేసి సుఖపడేట్లు చేస్తేనే అన్నయ్య ఆత్మకు శాంతి!"

కానీ సారధికి తెలుసు అది ఎంతటి బృహత్కార్యమో.

శ్యామల కూడా ఏమాలోచించిందో ఏమో - పసిగుడ్డు నొకసారి హృదయానికి హత్తుకుని గట్టిగా ముద్దుపెట్టుకుంది. పాపనే చూస్తూ మళ్లీ బావురుమంది.

" రేపు రాత్రి గోదావరి ఒడ్డుకు శ్యామలను తీసుకెవెళ్లాలి. మన చాకలి రత్తమ్మను రమ్మన్నాను. అక్కడ గాజులు పగలగొట్టి, ముండనం చేయాలి కదా" అన్నది సారధి మేనత్త, సోమయాజులతో.

సోమయాజులు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు.

రాజ్యలక్ష్మి అన్నది "అది అసలే బాలింతరాలు. ఈ కార్యక్రమం ఎలా జరుగుతుందో ఏమో.!"

"బండిలో తీసుకువెడితేసరి - తోడుగా నేనూ వెడతాలే" అన్నది మేనత్త, తన తలమీద ముసుగు సర్దుకుంటూ. ఆవిడకు పన్నెండోయేట పెళ్లయింది. పదమూడోయేట భర్త చనిపోయాడు. ఆవిడ తన భర్త చనిపోయిన ఆరు నెలలకు రజస్వల అయింది. వేరే ఏమీ దిక్కులేకపోవటంవల్ల భర్త పోయినప్పటి నుంచీ తన అన్న సోమయాజులు దగ్గరే వుంటున్నది. అలాగే ఆవిడ తన అరవైయేళ్ల జీవితం , చాకిరీ చేస్తూ విధవగా అన్న దగ్గరే గడిపేసింది.

"శ్యామలకు జుట్టు తీయించవద్దా వదిన గారూ!" జానకమ్మతో అన్నది సారధి మేనత్త.

" ఈకాలంలో అలాంటివేం చేయటంలేదు కదా వద్దులెండి, వదినగారూ! చిన్నపిల్ల

- అసలే బాలింతరాలు" జాలిపడింది జానకమ్మ.

"అలా అంటే ఎలా? మేమంతా అప్పుడు చేయించుకోలేదా - ఆచారం ప్రకారం ...

"అత్తయ్యా!" అరిచాడు సారథి.

"ఏమిట్రా నీ అరుపులు! మెల్లగా చెప్పలేవు" మందలించింది మేనత్త.

"జుట్టు తీసే ప్రసక్తి లేదు. అలా మాట్లాడటానికి మీకు జ్ఞానం లేదూ?"

"నేను కొత్తగా ఏమన్నాను? పద్ధతి ప్రకారం..."

"ఏమిటి నీ పద్ధతి ! నోరు మూసుకో. అటువంటివేం లాభం లేదు. అసలే చెట్టంత మనిషిని పోగొట్టుకుని వదిన బాధపడుతున్నది. అదీకాక కాన్పుతో, బాధతో నీరసించిపోయింది. ఇంకా ఎందుకీ పాడు ఆచారాలు."

సోమయాజులు కలుగచేసుకున్నాడు.

"జుట్టు తీయించవద్దులే. కాలం మారటంలే ! రేపు రాత్రి ఎద్దు బండిలో శ్యామలను గోదావరి ఒడ్డుకు తీసుకుపోయి మిగతా తతంగం కానీయండి!" అన్నాడు.

"ఆ పని చేయచ్చు వదినా ! రేపు రాత్రి నది ఒడ్డున గాజులు అవీ పగలకొట్టి ..." రాజ్యలక్ష్మి అంటున్నది.

" ఏం! అర్ధరాత్రి ఆ చలిలో గాదావరి ఒడ్డుకుపోయి ఏం చేయాలి? ఆ కార్యక్రమం జరగనందువల్ల కొంపలంటుకుపోవు. అన్నయ్య ఎలాగూ పోయాడు - యీ మూఢ నమ్మకాలతో, వున్న వదిన్ని కూడా పోగొట్టుకోవాలా? ఆ చల్లో అక్కడికి తీసుకుపోతే న్యుమోనియా వస్తుంది. అయినా అసలు వదిన ప్రస్తుతం కదిలే స్థితిలో వుందా?"

"నువ్వూరుకో సారథీ! నువ్వు చిన్నపిల్లాడివి. ఇలాంటి వ్యవహారాలు నీ కర్థం కావు.' ' మేనత్త అంది.

సారథికి ఆవిడ మాటల తరహా చూసి ఒళ్ళు మండిపోయింది. ఛడామడా తిట్టేద్దామనుకున్నాడు.

ఇంతలో సోమయాజులు కలుగజేసుకున్నాడు.

"పరవాలేదులే. మన వాకిట్లోనే ఆ కార్యక్రమం పూర్తిచేస్తే సరిపోతుంది. ఎలాగూ ఎల్లుండి పసుపు నీళ్ల చల్లి పుణ్యవంచనం అవీ చేయిస్తాం కదా!" అన్నాడు.

అంటూనే "సారథీ! బజారు పని చాలావుంది. ముందు అది చూడు. వెళ్ళు నాయనా!' ' లాలింపుగా అన్నాడు సోమయాజులు.

సణుక్కుంటూ సంచీ తీసుకు బయటకు వెళ్లాడు సారథి.

చాల క్రమశిక్షణతో ఒద్దికగా పెరగటం వల్ల తండ్రితో మాట్లాడటానికి కూడా అతనికి ఓ విధమైన జంకు వుంది. అందుకే తర్వాత తల్లి ఒంటరిగా కనపడినప్పుడు అడిగాడు, "ఏం గాజులు పగలకొట్టి, బొట్టు చెరిపేయకపోతే, ఏమవుతుంది?" అని.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. నోరు మూసుకు అవతలకి పో!" అన్నది తల్లి.

"వదినకి గాజులు పగలగొట్టి, బొట్టు చెరిపేస్తే కానీ అన్నయ్య పూర్తిగా చచ్చిపోయినట్టు కాదా!" మళ్లీ అడిగాడు.

సారథిని కోపంగా, విసురుగా చూసి వెళ్లి పోయింది రాజ్యలక్ష్మి.

"వదినని కూడా నీలాగా తయారుజేస్తే కానీ నీకు తృప్తి వుండదా!" అని అడిగాడు ముసుగు సర్దుకుంటూ వస్తున్న మేనత్తని.

ఆవిడ ముందు బిత్తరపోయినా, తేరుకుని, అదోరకంగా నవ్వి - "పిచ్చినాగన్నా అవేం మాటలురా! ఆ దేవుడు నాలానే దాన్నీ చిన్న చూపు చూశాడు. మనం ఏం చేయగలం చెప్పు?' అంటూ వెళ్లిపోయింది.

సారథికి ఏంచేయాలో తోచక పళ్ళు కొరుక్కున్నాడు.

సారథి మాటలు ఎవరూ పట్టించుకోలేదు. అంతేకాక ఆరోజు అర్థరాత్రి చలిలో రోడ్డు మీద పచ్చి బాలెంతరాలు శ్యామలను బలవంతంగా లాక్కుపోయి, చాకలి చేత గాజులు పగలకొట్టించారు. బొట్టు చెరిపేశారు. జడ విప్పేసి, జుట్టు ముడి వేశారు. చేతులకీ, కాళ్ళకీ , మెళ్ళోనూ వున్న బంగారు నగలు తీసేశారు. మెడలోని మంగళసూత్రం తీసేసి, తెంచేశారు. తెల్లటి జాకెట్టు తొడిగారు. ఆ అర్థరాత్రి చీకటిలో శ్యామల నీరసంగా వెక్కి వెక్కి ఏడుస్తుంటే - ఆ వెక్కిళ్ళు ఆమె కన్నీళ్ళతో కలసి, సారథి హృదయ్యాన్ని వెచ్చగా తాకాయి. సారథి హృదిలో బాధాతరంగాలు గోదావరిలోని సుడిగుండమంత ఉధృతంగా పైకిలేచాయి. తనకి ప్రాణబిక్ష పెట్టి, తన ప్రాణాల్నే త్యాగం చేసిన అన్నయ్య ఆ క్షణంలో, మరి తన భార్య గురించీ, పుట్టబోయే కూతురి గురించి ఆలోచించలేదు. తన మీద వున్న వాత్సల్యం అతన్ని ముందుకు నడిపించింది. కానీ యిప్పుడు ఆ త్యాగమూర్తి భార్య, రోజుల పసిపిల్లకు తల్లి ... అర్థరాత్రి చలిలో నిస్సహాయంగా, నిస్పృహతో, నిరాశతో విలపిస్తున్నది. అందరూ సానుభూతి చూపేవారేకానీ, ఆమె గుండెల్లో మంటలు రేపే ఈ మూఢనమ్మకపు కార్యక్రమాలకు అడ్డు చేప్పే వాళ్ళు ఎవరూ లేరు. సారథి మంచం మీద లేచి కూర్చున్నాడు. పిడికిళ్ళు బిగించి, ఏదో ఆలోచిస్తున్నాడు.

శ్యామలకి పుట్టిన రోజుల పాప, పాల కోసం కాబోలు ఏడుస్తున్నది.

బయట శ్యామల రోదన యింకా సన్నగా వినిపిస్తున్నది.

"స్నానం చేయించి లోపలకు తీసుకువచ్చి ఆ మూల గదిలో కూర్చోపెట్టండి - ఎవరూ చూడకూడదు" అంటున్నది మేనత్త.

"పిల్ల పాలకు ఏడుస్తున్నది -పాలు పట్టనీయండి -తర్వాత స్నానం చేయించవచ్చు!'

కాసేపయిన తర్వాత పాప ఏడుపు ఆగిపోయింది.

కానీ శ్యామల రోదన యింకా వినబడుతూనే ఉంది.

పాపకు పాలు దొరికాయి. ఆకలి తీరింది. ఏడుపు ఆపేసింది.

కానీ శ్యామల? ఆమె ఏడుపు ఆగేదెప్పుడు? ఎలా?

సారథి ఆలోచనలతోనే అలసిపోయాడు.

తెల్లవారింతర్వాత చూశాడు.

స్మశానంలో పని అయ్యాక వచ్చిన తర్వాత, ఒక్కొక్కళ్ళూ, శ్యామల కూర్చున్న గదిలోకి వెళ్ళి, బయటకు వస్తున్నారు. అక్కడ ఒక అక్షింతల పళ్ళెం వుంది. ఒక్కొక్కళ్ళూ అక్షింతలు తీసుకుని లోపలకు వెడుతున్నారు. లోపలకు వెళ్ళి ఆమె ముఖం చూసి, అక్షింతలు వేసి బయటకు వస్తున్నారు. లోపల నుంచి శ్యామల మూలుగు (ఈసారి ఏడుపులా లేదు - బహుశా ఏడిచి ఏడిచి అలసిపోయిందేమో) వినపడుతూనేవుంది.

ఎవరో ఒకావిడ ప్రక్క ఆవిడతో అంటున్నది - "ఆవిడ ముఖం చూసి రండి పిన్నిగారూ -ఆ ముఖం చూసేసి, నాలుగు అక్షింతలు పారేస్తే ఆ దోషం పోతుంది. ఇంక ఎప్పుడైనా ఆవిడ్నీ, ఈ యింట్లో దీపాన్నీ చూడవచ్చు -"

"లేకపోతే ఏమవుతుంది!" ఆవిడ దగ్గరకు వెళ్లి సూటిగా అడిగాడు సారధి.

ఆవిడ బిత్తరపోయింది. మాట్లాడలేదు.

"పశువులకు వచ్చినట్టు వయస్సు వస్తే కాదు, బుద్ధి వుండాలి - మనిషి పుట్టుక పుట్టినందుకు - ముందు బయటకు నడు "- అరిచాడు సారధి.

అక్కడ వున్నవాళ్ళందరూ ఈ హఠాత్సంఘటనకు నిచ్చేష్టులయ్యారు.

"బయటకు పదండి - మీరేం ఆవిడ ముఖం చూడక్కర్లేదు. దోషం వస్తే మీ ఖర్మ - మీ చావు మీరు చావండి!" అక్కడ చేరిన అమ్మలక్కల్ని అందర్నీ బయటకు తోసి తలుపు వేశాడు సారధి.

అతను కోపంతో వణికిపోతున్నాడు.

"ఏమిట్రా అది - పెద్దా చిన్నా లేకుండా..." సోమయాజులు ఏదో అనబోయాడు - సారధి ముఖం ఎర్రబడింది.

"మీరు కూడా ఏమిటి నాన్నా - అసలే వదిన అంత బాధలో వుంటే - ఈ పశువుల సంత ఏమిటి ? వీళ్ళు ఆవిడ ముఖం చూసి పోయేదేమిటి? ఏమిటి ఈ పాడు సంప్రదాయం? దీని వల్ల ఏమిటి మీరు బావుకునేది? మనుషుల్ని మనుషులుగా చూడలేనివాళ్ళు పశువులతో సమానం! ఆ పశువుల సంప్రదాయాలు మనకొద్దు!" విసురుగా అన్నాడు.

"సారధీ... మనకు కొన్ని ఆచారాలూ, సంప్రదాయాలూ..."

"టు హెల్ విత్ యువర్ కస్టమ్స్... యింకో మనిషిని అలా లోపలకు వెళ్లమను, చంపిపారేస్తాను - రాస్కెల్స్" సారధి కోపంతో వూగిపోతున్నాడు. కళ్ళు ఎర్రగా వున్నాయి.

సోమయాజులు కూడా యిక ఏమీ మాట్లాడలేదు.

సారధి ఒక క్షణం అందర్నీ చూసి డాబా మీదకు వెళ్లిపోయాడు -

తర్వాత రోజు "యిక శ్యామల భవిష్యత్తు ఏమిటి?" అన్న చర్చ వచ్చింది సోమయాజులు, రాఘవయ్యల మధ్య.

"మేమెలాగో సారధికి పెళ్లవ్వగానే - వాడితో మద్రాస్ వెళ్లిపోవలసిన వాళ్ళమేగదా - యిక మిగిలిన కొడుకు వాడొక్కడూ - వాడితోనే వుండిపోతాం - శ్యామలనూ, పిల్లనూ మీరు తీసుకె వెళ్లిపొండి. కావలిస్తే ఆ బాధ మరచిపోయేదాకా కొన్నాళ్ళు యిక్కడే వుంటుంది!" అన్నాడు సోమయాజులు.

"అదెలాగ - నాకు సంపాదన ఏమీలేదు - నేను యింకా ముగ్గురు కూతుళ్ళకు పెళ్లి చేయవలసినవాడిని - చెల్లెలి కూతురనే అభిమానంతో చిన్నప్పటినుంచీ పెంచి పెద్ద చేసి పెళ్లి చేశాను. ఇక నా వల్ల కాదు!" అని దులిపేసుకున్నాడు రాఘవయ్య.

ఈ మాటలు ఈ గదిలో వున్న సారధికి, ఆ గదిలో వున్న శ్యామలకూ వినపడుతూనే వున్నాయి.

అయినా వాళ్ళ మధ్య తీవ్రంగా, మీ దగ్గర అంటే, మీ దగ్గర అని చర్చలు సాగుతున్నాయి.

సారధి ఆలోచిస్తున్నాడు. అతను ఆలోచిస్తున్నది శ్యామల ఎక్కడ వుండాలి అని కాదు. ఎక్కడ వున్నా ఎలా జీవించాలి అని. శ్యామల పెద్దగా చదువుకోలేదు. ఆర్థికంగా తన కాళ్ళ మీద తను నిలబడలేదు. ఆమె జీవితం ఎలా గడపాలి? ధనం వున్న స్త్రీ అయితే రెండో వివాహం చేసుకోవటానికి అవకాశాలు వున్నాయి. ఏమీలేని శ్యామలను చేసుకునేదెవరు? ఒకసారి వివాహం చేయటానికే, కట్నాలు యిచ్చుకోలేక మధ్య తరగతి ఆడపిల్లల తండ్రులు నానా అవస్థపడుతుంటే, భర్త పోయి, పిల్ల తల్లి అయిన స్త్రీని , కట్నం అడగకుండా ముందుకు వచ్చి ఉద్ధరించే సంస్కారవంతుడు నిజ జీవితంలో తారసపడటం సంభవమా?

వదిన... శ్యామల... ఒక స్త్రీ.

పాతిక సంవత్సరాలు దాటని స్త్రీ.

జీవించటం మరచిపోతున్న స్త్రీ,

సంఘం కట్టుబాట్లలో కాలిపోతున్న స్త్రీ -

ఏమిటీ ఆమె మీద తనకి సానుభూతా యిది? కాదు - యిలాంటివారి జీవితాల గురించి హృదయం చేసే ఘోష.

అలాటివారికి చేయిని అందించి, ఆప్యాయత, అనురాగం పంచివ్వాలనే తహ తహ

బయట సోమయాజులుకూ, రాఘవయ్యకూ రాజీ కుదదలేదు. యింకా ఘర్షణ పడుతూనేవున్నారు.

సారధి సరాసరి వాళ్ళ దగ్గరకు వెళ్లాడు.

" ఈ విషయంలో మీరిక ఘర్షణ పడటం అనవసరం! శ్యామల విషయం నాకు వదిలేయండి" - అన్నాడు.

★ ★ ★

వేణు గోపాలస్వామి గుళ్ళో శాస్త్రులుగారు పురాణం చెబుతున్నారు.

"తల్లి కోరిక ప్రకారం - పంచపాండవులు అయిదుగురూ ద్రౌపదిని పెళ్లాడటానికి ఒప్పుకున్నారు. అలా ద్రౌపది , అయిదుగురు అన్నదమ్ములకూ భార్యగా వుండి, మహా పతివ్రత అనిపించుకుంది!"

శాస్త్రులుగారు వెలిగించిన హారతి కర్పూరం అందరూ కళ్ళకు అద్దుకున్నారు. పంచపాండవులకూ, ద్రౌపదికీ నమస్కారాలు చేశారు.

అలా నమస్కారాలు చేసిన సమాజం మధ్య వంటరిగా, నిటారుగా నుంచుని - "శ్యామలకు ఈ కష్టాలూ రాకుండా గుండెల్లో దాచుకుంటాను!" అని ప్రమాణం చేశాడు సారధి, మనసులోనే భానుమూర్తికి తన నిర్ణయం తెలియచేస్తూ.